క్లుప్తంగా

కోదండరామునికి ప్రత్యేక పూజలు



మాచర్ల: పట్టణంలోని కోదండరామాలయంలో ముందస్తు శ్రీరామనవమి ఉత్సవాలను శుక్రవారం నిర్వహించారు.ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని వామనావతారంలో అలంకరించి, భక్తులకు దర్శనంగావించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బచ్చు రామారావు, ప్రధాన కార్యదర్శి కొత్తూరి వెంకట బాల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తిరివీధి వెంకట నాగేశ్వరరావు తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

చల్లబడి.. ఎండపడి



మాచర్ల: పట్టణంలో గురువారం వర్షం కురిసింది. దీంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. శుక్రవారం ఉదయం నుంచే ఎండలు విపరీతంగా కాశాయి. రెండు రోజుల్లో భిన్న వాతావరణ మార్పులను ప్రజలు చూశారు. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షానికి రోడ్లపై వర్షపు నీరు నిలిచింది. ఉదయం వరకు చల్లటి వాతావరణం ఉందని ప్రజలు ఆనంద పడేలోపే సూర్యుడు భగభగమన్నాడు.

కృష్ణవేణిలో గ్రాడ్యుయేషన్ డే



మాచర్ల: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. పాఠశాల యజమాని డాక్టర్ సదాశివరాజు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరానికి యూకేజీ, 5వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ నిర్వహించి, పట్టా ప్రదానం చేసినట్లు తెలిపారు. ప్రిన్సిపల్ హనుమంతరావు, హరిశ్చంద్ర, పాఠశాల ఇన్‌చార్జి, సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణలో గ్రాడ్యుయేషన్ డే

మాచర్ల: పట్టణంలోని నారాయణ స్కూల్లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ సురేష్ పాల్గొన్నారు. యూకేజీ, 5వ తరగతి విద్యార్థులను పైతరగతులకు ప్రమోట్ చేస్తూ పట్టాలను అందజేశారు. ఏజీఎం లక్ష్మణ్ రెడ్డి, కో–ఆర్డినేటర్ భద్రారెడ్డి, గౌసియా, మారియా, రిహానీ మాట్లాడుతూ చిన్నారుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రిన్సిపల్ ఉల్లారెడ్డి, స్కూల్ ఇన్‌చార్జిలు ఆంజనేయులు, ఉదయలక్ష్మీ, సునీత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివ కిరణ్ రాజు పాల్గొన్నారు.

పిన్నెల్లికి కృతజ్ఞతలు



పిడుగురాళ్ల: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా పిడుగురాళ్ల పట్టణానికి పార్టీ రాష్ట్ర వైద్య విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ కలిశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు శాలువా కప్పి సన్మానించుకున్నారు. డాక్టర్ చింతలపూడి మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

స్వామివారికి గంధాభిషేకం



పిడుగురాళ్ల: పట్టణంలోని నాగుల గుడిలో శుక్రవారం చైత్ర శుద్ధ షష్టి పురస్కరించుకొని సంతాన సుబ్రహ్మణ్య స్వామికి 27 కిలోల గంధంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించి, భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేశారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉత్తమ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రాణి

నరసరావుపేట ఈస్ట్: ప్రకాష్‌నగర్‌లోని సెయింటాన్స్ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కొత్తపల్లి రాణి 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో ఉత్తమ ప్రోగ్రామ్ ఆఫీసర్ అవార్డుకు ఎంపికయ్యారు. వర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ ఆచార్య కె.గంగాధరరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. శుక్రవారం ప్రిన్సిపల్ జి.ఆంతోనమ్మ అభినందించారు.

గడ్డికి గడ్డుకాలం

వరిగడ్డికి గడ్డుకాలం వచ్చింది. మూగజీవాలు మేత కోసం పశుపోషకులు అవస్థలు పడుతున్నారు. వరి సాగు గణనీయంగా తగ్గిపోవడంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. దీంతో పశువులకు గడ్డి అందించడం రైతులు ఇబ్బందిగా మారింది. పక్క రాష్ట్రం తెలంగాణ నుంచి అధికంగా డబ్బులు వెచ్చించి రైతులు వరిగడ్డి కొనుగోలు చేస్తున్నారు.



తెలంగాణ నుంచి ట్రాక్టర్‌లో వస్తున్న వరిగడ్డి

- కుదించుకుపోయిన వరి సాగు
- వరిగడ్డి కొరతతో పశుపోషణపై ప్రభావం
- పక్కం రాష్ట్రం నుంచి అధిక ధరకు కొనుగోలు
- పెరిగిన దాణా ధరలు, నీటి కొరతతో తిప్పలు
- ప్రభుత్వం నుంచి అందని రాయితీ దాణా
- పశుగ్రాసం సాగుకు ప్రోత్సాహం కరువు

దాచేపల్లి: పశుపోషణ భారమైంది. వ్యవసాయ పనుల కంటే అధికంగా రైతులు, కూలీలు గొర్రెలు, మేకలు, పాడి పశువుల పెంపకంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. గురజాల నియోజకవర్గంలో ఆవులు, ఎడ్లు, గేదెలు 54 వేలు, 4.50 లక్షలకు పైగా గొర్రెలు, మేకలు ఉన్నాయి. వీటిపై ఆధారపడి 10 వేలకు పైగా కుటుంబాలు ఉన్నట్లు పశు సంవర్ధకశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గతంలో పశుగ్రాసం అందుబాటులో ఉండడంతో పశుపోషణపై ఎక్కువగా ఆధారపడ్డారు. పాలు, పెరుగు, నెయ్యి, పశువుల క్రయ విక్రయాల ద్వారా పోషకులకు బాగా లాభాలు తెచ్చిపెట్టాయి. వరి సాగు ఎక్కువగా ఉండడంతో గడ్డి ధరలకు కూడా అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం వరిగడ్డి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పల్నాడు ప్రాంతంలో వరి సాగు గణనీయంగా తగ్గడంతో గడ్డికి బాగా డిమాండ్ ఏర్పడింది. ఖరీఫ్, దాళ్వా సీజన్‌లో అక్కడ పండించిన వరి పంట పూర్తి అయిన తరువాత ట్రాక్టర్ల ద్వారా ఇక్కడకు వరిగడ్డి తీసుకువస్తున్నారు.

వరిగడ్డికి డిమాండ్

తెలంగాణ నుంచి ట్రాక్టర్ ట్రక్కు వరిగడ్డిని రూ.15 వేలకుపైగా వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. నాలుగు గేదెలు ఉంటే వరిగడ్డి రూ.50 వేల వరకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక్కడ వరి గడ్డి లేకపోవడం వద్ద అక్కడ నుంచి వచ్చే వరిగడ్డికి బాగా డిమాండ్ పెరిగింది. పశు పోషకుల అవసరాన్ని అసరగా చేసుకుని ధరలకు విపరీతంగా పెంచుతున్నారు. ముందుగానే అడ్వాన్స్‌లు చెల్లించి వరి గడ్డిని కొనుగోలు చేస్తున్నారు. దామరచర్ల, మిర్యాలగూడెం, తిప్పర్తి, మఠంపల్లి తదితర ప్రాంతాల నుంచి వరిగడ్డి ఎక్కువగా గురజాల నియోజకవర్గానికి వస్తుంది. సకాలంలో పశువులకు వరిగడ్డిని అందించకపోవటంతో పాల దిగుబడి కూడా తగ్గుతుందని రైతులు చెబుతున్నారు.

తాగునీటికి కటకట

ఒక వైపు పశుగ్రాసం కొరత ఉండగా మరో వైపు మూగజీవాలకు నీటి కొరత కూడా ఉంది. గడ్డి కోసం పోలాలకు వెళితే అక్కడ చుక్కనీరు కూడా అందని పరిస్థితి ఉంది. వేకువజామునే పోలాలకు మూగజీవాలను తీసుకెళ్లి ఉదయం 11 గంటలకే ఇంటికి తీసుకువస్తున్నారు. మూగజీవాల కోసం పోలాల్లో నీటిని నిల్వ చేయాలని రైతులు కోరుతున్నారు.

పెరిగిన దాణా ధర



గడ్డికోసం పోలంబాట పట్టిన గేదెలు

స్థానికంగా వ్యవసాయ బోర్లు ఉన్న పోలాల్లో రైతులు జాడుని పెంచుతున్నారు. ఈ జాడుని సెంటు వెయ్యి రూపాయల నుంచి రూ.1,500 వరకు విక్రయిస్తున్నారు. దాణా, శనగచెక్క, బిస్కెట్ తవుడు ధరలు కూడా బాగా పెరిగాయి. గతంలో రూ.900 పశు దాణా బస్తా ప్రస్తుతం రూ.1,500కు చేరింది. పశు సంవర్ధకశాఖ నుంచి ప్రభుత్వం రాయితీతో కూడిన గడ్డిని అందించకపోవడం రైతులకు శాపంగా మారింది.

రాయితీ దాణాకు ఆర్డర్ ఇచ్చాం



పశుగ్రాసం కొరత ఉండడం వల్ల పశుపోషకులకు అండగా ఉండేందుకు చర్యలు తీసుకున్నాం. 50 శాతం రాయితీపై పశుదాణా ఇచ్చేందుకు 400 మెట్రిక్ టన్నులు అర్డర్ పెట్టాం. ఇవి త్వరలోనే వస్తాయి. పోలాల్లో వ్యవసాయ బోరు ఉంటే గడ్డిని పెంచేలా ప్రోత్సాహిస్తున్నాం. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో పశువులను పోలాలకు తీసుకెళ్లకూడదు. తాగునీటిని పశువులకు అందుబాటులో ఉంచాలి.

– నార్ల చెన్నయ్య, పశువైద్యాధికారి, దాచేపల్లి

‘ఉపాధి’ పనులపై సమీక్ష

మాచర్ల: ఉపాధి హామీ పథకంలో అందరికీ పనులు కల్పించాలని మండల ప్రత్యేక అధికారి, గురజాల డీఎల్‌డీఓ గ్రబునాయక్ ఆదేశించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పంచ ప్రాధాన్యాలపై ఫీల్డ్ అసిస్టెంట్‌లకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ ఫణికుమార్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పశువుల నీటి తొట్టెలు, రైతుల పొలంలో సేద్యపు కుంటలు నిర్మించాలని చెప్పారు. కూలీలకు రూ.300లు వచ్చే విధంగా కొలతలు తీసి, పనులు చేయించాలని స్పష్టం చేశారు. పని ప్రదేశాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఏపీఓ నాగ శ్రీనివాస్ మాటాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించామని, అందరూ పనులు చేసుకోవచ్చని వెల్లడించారు. దీనిపై గ్రామాల్లో దండోర వేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు దిశానిర్దేశం చేశారు. జేఈ గోపీ, టెక్నికల్ అసిస్టెంట్లు కిషోర్, వెంకయ్య పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తున్నాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

దాచేపల్లి : వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం నియోకవర్గ అధ్యక్షుడు షేక్ సుభానీ అన్నారు. నారాయణపురంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుభానీ మాట్లాడుతూ..ముస్లింలకు మేలు చేసిన ఏకైక కుటుంబం వైఎస్సార్ కుటుంబమన్నారు. వైఎస్సార్ హయాంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వక్ఫ్‌బోర్డు బిల్లును వైఎస్సార్ సీపీ వ్యతిరేకించి, ముస్లింలకు అండగా నిలిచిందన్నారు. రాష్ట్రంలోని టీడీపీ, జనసేన పార్టీలు వక్ఫ్‌బోర్డు బిల్లుకి అనుకూలంగా ఉండి ముస్లిం మనోభావాలను దెబ్బతీశాయని విమర్శించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్ మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. వక్ఫ్ బోర్డు బిల్లుకు మద్దతు తెలిపిన ప్రాంతీయ పార్టీలు ముస్లింలకు సమాధానం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. వైస్‌ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా, సర్పంచ్ షేక్ ఇమామ్‌వలి, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ సైదా, నాయకులు మోమిన్ నాగుల్‌మీరా, షేక్ సైసావలి, డాడీ, జానీ, గన్ను బుడే, వలి పాల్గొన్నారు.

అందుబాటులోకి ఆర్వో వాటర్ ప్లాంట్!

సాక్షి ఎఫెక్ట్



ఆర్టీసీ బస్టాండ్‌లో నీరు తాగుతున్న సిబ్బంది

మాచర్ల రూరల్: దాతల ఔన్నత్యంతో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్మించిన వాటర్ ప్లాంట్ అధికారుల నిర్లక్ష్యంతో మూలన పడింది. ప్రయాణికుల దప్పిక తీర్చేందుకు లక్షలాది రూపాయలతో కేసీపీ సిమెంట్స్ యాజమాన్యం వాటర్ ప్లాంట్ నిర్మించింది. వేసవి సమీపిస్తున్న వేళ ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మార్చి 11న ‘‘సాక్షి’’లో సమస్యపై కథనం ప్రచురితమైంది. ఎట్టకేలకు దీనిపై స్పందించిన ఆర్టీసి జిల్లా అధికారులు, స్థానిక డీఎం బత్తుల వీరాస్వామి మూలనపడిన వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించారు. ప్లాంట్‌కు కూలింగ్ ఫ్రిడ్జ్ ఏర్పాటు చేసి, ప్రయాణికులకు చల్లటి నీరు అందిస్తున్నారు. ప్రయాణికులకు అందుబాటులో ఉండే విధంగా బస్టాండ్ మెట్ల వద్దకు పైపులైన్ ఏర్పాటు చేసి, వాటర్ వినియోగించుకునేలా ట్యాప్‌లను నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో ‘న్యూటన్స్’ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ జగదీష్‌రెడ్డి

మాచర్ల రూరల్: విద్యార్థి దశ ముగింపులోనే క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఎంపిక కావడం ఎంతో అభినందనీయమని న్యూటన్స్ గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని న్యూటన్స్ కళాశాలలో టెక్ మహీంద్ర ప్రతినిధులు నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపికైన వారినుద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రసిద్ధ టెక్ మహీంద్రా ఐటీకి 12 మంది విద్యార్థులు ఎంపిక కావడం శుభపరిణామమన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను ఒమ్ము చేయకుండా ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో విద్యనందుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జగదీష్‌రెడ్డి, టీపీఓ రామ్మోహన్‌రెడ్డి, అధ్యాపక బృందం తదితరులున్నారు.

విజయవంతంగా క్రైస్తవ శాంతి ర్యాలీ

వినుకొండ : క్రైస్తవ సమాజ ఐక్యతను చాటిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా వినుకొండ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. పట్టణంలోని కారంపూడి రోడ్డులోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఉన్న ఆరీసీఎం జీవాలయం నుంచి ప్రారంభమైన శాంతి ర్యాలీ వెన్నెల సూపర్ మార్కెట్ , ఆర్టీసీ బస్టాండ్, శివయ్య స్థూపం ఏరియాల మీదుగా సాగుతూ తహసీల్దార్ కార్యాలయం వద్దకు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జేఏసీ నాయకులు పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలని కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పాస్టర్లు, పలు సంఘాల నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

దేవదాయ భూముల కౌలుకు 9న బహిరంగ వేలం



తుమ్మకోట భూముల్లో ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి

రెంటచింతల: దేవదాయ శాఖ అనుమతి లేకుండా మండలంలోని వివిధ గ్రామాల్లోని దేవదాయ శాఖ ఆలయ భూములను ఈ ఉగాది నుంచి సాగుచేయవద్దని ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పలు గ్రామాల్లోని ఆలయ భూములను సందర్శించారు. దేవదాయశాఖకు సహకరించాలని సాగుదారులను కోరారు. ఆలయ, పూజారి భూములకు త్వరలో నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొని, కౌలు చెల్లించి పంటలను సాగు చేసుకోవాలన్నారు. కౌలు చెల్లించిన రైతులకు మాత్రమే ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని చెప్పారు. రెంటచింతలలోని ఆంజనేయస్వామి, మల్లేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, మిట్టగుడిపాడులోని వేణుగోపాలస్వామి, తుమ్మకోటలోని రామలింగేశ్వరస్వామి, సీతారామస్వామి, జనార్ధనస్వామి, రెంటాల లక్ష్మీ చెన్నకేశవస్వామి, మల్లవరంలోని నీలకంఠేశ్వరస్వామి, జెట్టిపాలెం సత్రశాల మల్లేశ్వరస్వామి దేవస్థానాల మొత్తం 399.58 ఎకరాల భూములకు ఈ నెల 9 నుంచి బహిరంగ వేలం నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు.

పాలిటెక్నిక్ ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం



శిక్షణ తరగతులను రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న హెచ్‌ఎం ధనలక్ష్మి

పిడుగురాళ్ల: పాలిటెక్నిక్ శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మన్నె పుల్లారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లింగాల ధనలక్ష్మీ అన్నారు. పట్టణంలోని పాఠశాలలో ఏపీయూటీఎఫ్, జనవిజ్ఞాన వేదిక, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పాలిటెక్నిక్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈకార్యక్రమానికి హెచ్‌ఎం ధనలక్ష్మీ హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాలిటెక్నిక్ కోసం ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించడం విద్యార్థులకు మంచి అవకాశమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పి. శ్రీనివాసరావు, ఎస్కే సైదా, విజయసారథి, రవిచంద్రశేఖర్, షేక్ ఖాశీం ఫీరా, షేక్ జమాల్, సాంబశివరావు, గౌష్, ప్రసాదరావు, డి. శ్రీనివాసరావు, శివశంకర్, కె. ప్రశాంత్‌రాజ్, డి. సాయిబాబా పాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముని ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవం



పూజలనంతరం ఆలయంలో పీఆర్కే, మురళీధరరెడ్డి

కారెంపూడి: మండలంలోని పెదకొదమగుండ్ల శివారు రెడ్డిపాలెం గ్రామంలో శ్రీకోదండ రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే), గురజాల వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎనుముల మురళీధరరెడ్డి ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. ధ్వజ స్తంభానికి, కోదండరామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ధ్వజ స్తంభాన్ని క్రేన్ సాయంతో ప్రతిష్ఠించారు. వేలాదిగా ప్రజలు కోదండరామునికి జేజేలు పలికారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. భోజన రాసులకు పీఆర్కే ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మందాళ్ల అంజిరెడ్డి, మేకల శ్రీనివాసరెడ్డి, అల్లు వెంకటేశ్వర రెడ్డి, పలువురు మండల వివిధ గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

రొంపిచర్ల: వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్ –కాలేజీలో శుక్రవారం విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం కింద ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుచున్న విద్యార్థులకు అందచేశారు. ప్రిన్సిపల్ బి.రవినాయక్ మాట్లాడుతూ విద్యార్థులకు నోట్ పుస్తకాలు ఎంతో విలువైనవన్నారు. విలువైన సమాచారాన్ని నోటు పుస్తకాలలో రాసుకోవడం, తిరిగి చదువుకోవడం కోసం ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వీటి వలన విద్యార్థులలో నైపుణ్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..



మాచర్ల రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించి, భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంఈఓ అల్లి సురేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్లపల్లి, ఎత్తిపోతలలో నేషనల్ గ్రీన్ క్రాప్ పర్యావరణ విద్య క్యాంపులో భాగంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. అటవీ ప్రాంతంలో సీడ్‌బాల్స్ ను విద్యార్థులతో కలిసి వదిలారు. విద్యార్థులకు స్వచ్ఛ ప్రతిజ్ఞ, క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం షేక్ సకీనా, ఉపాధ్యాయులు కేఎస్ రావు పాల్గొన్నారు.

మే 10న లోక్ అదాలత్

గురజాల: లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని నాలుగవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆర్.శరత్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక కోర్టు భవనాలలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మే 10వ తేదీన లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

రథోత్సవ ఏర్పాట్ల పరిశీలన

మాచర్ల: పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల నేపథ్యంలో దేవాలయ ప్రాంతంలోని రథం బజారులో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ డి.వేణుబాబులు శుక్రవారం పర్యటించారు. ఆ ప్రాంతంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రథోత్సవానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా పురపాలక సంఘం కార్మికులకు పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఏఈ గౌతమి, విద్యుత్ శాఖ డీఈ రామయ్య, ఏఈ కోటేశ్వరరావు, 26 వార్డు కౌన్సిలర్లు దస్తగిరి, నాగూర్, విద్యుత్ కాంట్రాక్టర్ రెడ్యా నాయక్, శ్రీనివాసరావు, కృష్ణ ఉన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రణాళిక

మాచర్ల: పట్టణంలో మెప్మా ప్రాజెక్టు కార్యాలయం పక్కన ఖాళీ స్థలంలో మరుగుదొడ్ల నిర్మాణానికి పురపాలక సంఘ అధికారులు చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ డి.వేణుబాబు ఆధ్వర్యంలో శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. మెప్మా, మున్సిపల్ కార్యాలయాలకు వచ్చే మహిళల కోసం మరుగుదొడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.

స్వచ్ఛ మున్సిపాలిటీకి సమష్టి కృషి చేయండి

మాచర్ల: మున్సిపాలిటీల అభివృద్ధికి సంబంధిత అధికారులు, మెప్మా సంయుక్తంగా కృషి చేయాలని రాష్ట్ర పురపాలక సంఘం ప్రిన్సిపల్ కార్యదర్శి సురేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్సులో ఆయా మున్సిపల్ అధికారులతో ఆయన మాట్లాడారు. పట్టణాన్ని స్వచ్ఛ మాచర్లగా మార్చాలని, ప్రతి నెలా 3వ శనివారం ర్యాలీ నిర్వహించి, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. ఇంటి, నీటి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. డీఈ సుభాని, ఏఈ గౌతమి, మెప్మా ప్రాజెక్టు సీఓలు రాజశేఖర్, ప్రాజెక్టు మేనేజర్ శ్యామలాదేవి, ఆర్ఐ వెంగయ్య, ఆర్ఓ సాంబశివరావు కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

వెల్దుర్తి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడినట్లు ఎంపీడీఓ డి.ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోరం కాకపోవడంతో మధ్యాహ్నం 12 గంటల వరకు చూసి, సమావేశాన్ని వాయిదా వేశామని పేర్కొన్నారు. మండల పరిషత్‌లో 14 మంది సభ్యులకు గాను ఒకరు సెలవులో ఉండగా.. ఇద్దరు సభ్యులు మాత్రమే హాజరయ్యారని తెలిపారు. తదుపరి సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

దుర్గి: మండలంలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ జి.బాలస్వామి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ (ఇంగ్లీషు మీడియం) గ్రూపులలో చేరాలనుకునే విద్యార్థులు మే 22వ తేదీ లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. వివరాలకు కళాశాలలో లేదా 916064 9929, 94407 26518 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

రేపు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రెంటచింతల: స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో 2014–15 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థులు సత్యాల సాగర్, సురేష్, సునీల్, విజయ్ శుక్రవారం తెలిపారు. వంద మందికి పైగా పూర్వ మిత్రులతో ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందన్నారు. పూర్వ విద్యార్థులందరూ తప్పకుండా పాల్గొనాలని పేర్కొననారు.

7న మండల పరిషత్ సమావేశం

నరసరావుపేటరూరల్: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 7వ తేదీ సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ మొరబోయిన సుబ్బాయమ్మ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం జరుగుతుందన్నారు. శాఖల వారీగా సమీక్షతో పాటు అధ్యక్షుల అనుమతితో ఇతర అంశాలపై చర్చిస్తామని తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు మండల అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.